క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. వినోభానగర్‌లోని సామాజిక మరుగుదొడ్ల ఆవరణ పరిశుభ్రం చేశారు. గాంధీనగర్‌లో మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించారు. ఆస్తి పన్ను మదింపు చేయడంలో భాగంగా రెవెన్యూ విభాగం సిబ్బంది కొత్త ఇళ్లు, పునర్ నిర్మాణ ఇళ్ల కొలతలు తీసుకున్నారు. పన్ను బకాయలు చెల్లించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో రెవెన్యూ అధికారి ఆంజనేయులు, ఆర్‌ఐలు శంకర్‌రావు, ఖాజా, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అవసరం మేరకే యూరియా అందించాలి

ఎలిగేడు: రైతుల అవసరం మేరకే యూరియా అందజేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.ఉమాపతి అన్నారు. ఎలిగేడు, ధూళికట్ట గ్రామాల్లోని వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ ఎరువులు షాపుల్లో యూరియా అమ్మకాలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ భూమి ఆధారంగా యూరియా అందజేయాలని ఎరువుల అమ్మకందారులకు సూచించారు. ప్రస్తుతం మండలంలో 2850 బస్తాల యూరియా రైతులకు అందుబాటులో ఉందని తెలిపారు. ప్రస్తుతం రైతులందరికీ మొదటి దఫా యూరియా అందించామని, రెండో దఫా యూరియా బదులుగా ద్రవరూపంలో ఉన్న నానో యూరియాను పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

పల్లెల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కాల్వశ్రీరాంపూర్: పల్లెల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో పూర్ణ చందర్‌రావు కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని మల్యాల, ఇప్పలపల్లి, కాల్వశ్రీరాంపూర్ గ్రామాల్లో మంగళవారం వీధుల్లో ముళ్లపొదలను, పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీల్లో మురుగును తొలగించారు. నీటిగుంతల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. ఎంపీవో ఆరిఫ్ హుస్సేన్, కార్యదర్శులు అహ్మదీబేగం, సత్యనారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ముత్తారం: మండలంలోని శాత్రాజ్‌పల్లి గిరిజన గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రూ.3.40కోట్ల మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబు చిత్రపటానికి మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గిరిజన గ్రామాన్ని పట్టించుకోలేదని, మంత్రి దష్టికి తీసుకెళ్లగానే నిధులు మంజూరు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సింగిల్‌విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, డైరెక్టర్ బోలినేని బుచ్చంరావు, నాయకులు కాసిపొజ్జుల వీరాచారి, తాటిపాముల శంకర్, గూట్ల రవీందర్ పాల్గొన్నారు.

రైతుల భూసమస్యలు పరిష్కరించాలి

ఓదెల: రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని మాజీ జెడ్పీటీసీ గంట రాములుయాదవ్ కోరారు. మంగళవారం ఆయన పలు గ్రామాలకు చెందిన రైతుల సమస్యలు తహసీల్దార్‌కు విన్నవించారు. ఇటీవల గ్రామాల్లో ఏర్పాటు చేసిన భూభారతి రైతుసదస్సులలో దరఖాస్తులు ఇవ్వని రైతులకు మరో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

నానోయూరియా వినియోగంపై అవగాహన

పాలకుర్తి: నానో యూరియా వాడకంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని కుక్కలగూడుర్‌లో పత్తి పంటలో నానో యూరియా వాడకంపై మంగళవారం రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. బస్తాల రూపంలో ఉన్న యూరియాను వాడటం ద్వారా దాని పనితనం 30శాతం వరకు మాత్రమే ఉంటుందని, ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా వాడకం ద్వారా 80శాతం వరకు పనితనం ఉంటుందని వివరించారు. నానో యూరియా ఎకరానికి అర లీటర్ మాత్రమే సరిపోతుందని, దాని ధర కూడా కేవలం రూ.225 మాత్రమే ఉంటుందని తెలిపారు. రైతులు నానో యూరియా వాడటం ద్వారా భూమి కూడా సారవంతం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- ప్రారంభానికి నోచుకోని కమ్యూనిటీహాల్
- అందుబాటులోకి తీసుకురావాలని పోతనకాలనీవాసుల వినతి



పోతనకాలనీలో నిర్మించిన కమ్యూనిటీ హాల్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం డివిజన్–2 ఏరియా పోతనకాలనీలో నివాసం ఉంటున్న సింగరేణి కార్మిక కుటుంబాల కోసం దాదాపు రూ.2కోట్ల నిధులతో గత సింగరేణి కార్మిక సంఘం టీబీజీకేఎస్ హయాంలో అప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చందర్ సింగరేణి అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు పూర్తి చేసి దాదాపు ఏడాది గడిచినా సింగరేణి యాజమాన్యం అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో కార్మిక కుటుంబాలు శుభకార్యాలు జరుపుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి

పోతనకాలనీలోని సింగరేణి కార్మిక కుటుంబాలు వారి క్వార్టర్లలో కనీసం చిన్న ఫంక్షన్ జరుపుకునేందుకు స్థలం లేకపోవడంతో కార్మికుల విజ్ఞప్తి మేరకు ఆర్జీ–2 సింగరేణి యాజమాన్యం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.2కోట్ల నిధులు మంజూరు చేసి కమ్యూనిటీ హాల్‌తో పాటు గ్రంథాలయం నిర్మించారు. వీటిని ప్రారంభించకపోవడంతో కార్మికులు దూర ప్రాంతాలకు వెళ్లి ఫంక్షన్లు జరుపుకుంటున్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి కమ్యూనిటీహాల్, గ్రంథాలయం ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని కార్మికులు కోరుతున్నారు.

సింగరేణి సీఎండీ వస్తున్నారని..

కొన్ని నెలల క్రితం ప్రారంభానికి సింగరేణి సంస్థ సీఎండీ వస్తున్నారని హడావుడిగా ఏర్పాట్లు చేశారు. చివరి నిమిషంలో రద్దు కావడంతో ప్రారంభం ఆగిపోయింది. అంతేకాకుండా గతనెలలో రాష్ట్ర మంత్రులు, సంస్థ సీఎండీ వస్తారని కమ్యూనిటీ హాల్, గ్రంథాలయంతో పాటు సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో సీబీఎస్‌ఈ బోధన ప్రారంభిస్తారని రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాట్లు చేశారు. చివరి క్షణంలో రద్దయింది. అయితే సింగరేణి సొమ్ము వృథాగా ఖర్చులు పెడుతున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. సింగరేణి కార్మిక సంఘాలు సైతం చూస్తూ ఉండడం తప్ప కార్మికుల కోసం ఏమీ చేయడం లేదని కార్మిక కుటుబాలు ఆరోపిస్తున్నాయి.

యాజమాన్యం పట్టించుకోవాలి



కమ్యూనిటీ హాల్ ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తే పోతనకాలనీ వాసులు వారి ఇంట్లో జరిగే పెళ్లిళ్లు, శుభకార్యాలు నిర్వహించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. దూర భారం తగ్గడమే కాకుండా ఖర్చు కూడా తగ్గుతుంది. సింగరేణి యాజమాన్యం పట్టించుకొని కమ్యూనిటీ హాల్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

– విమల, పోతనకాలనీ

అందుబాటులోకి తీసుకురావాలి



టీబీజీకేఎస్ యూనియన్‌గా ఉన్న కాలంలో అప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. నిర్మాణం పూర్తయినా ఇంతవరకు అందుబాటులోకి తీసుకురాకపోవడంతో సింగరేణి కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. కమ్యూనిటీ హాల్‌తో పాటు గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా సింగరేణి యాజమాన్యం చర్యలు చేపట్టాలి.

– ఐలి శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తకణాలు లెక్కించే యంత్రం పని చేయడం లేదు. పీహెచ్‌లో రెండేళ్ల క్రితం వైద్యశాఖ నుంచి బ్లడ్ సెల్ కౌంటర్ యంత్రాన్ని పీహెచ్‌సీలో ఏర్పాటు చేశారు. కొంత కాలం పాటు పని చేసిన మిషన్ ఏడాది నుంచి సాంకేతిక సమస్యతో పని చేయడం లేదు. సర్వీస్ ఇంజనీర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సిబ్బంది తెలిపారు. పీహెచ్‌కి వచ్చే రోగులకు రక్త పరీక్షలు చేయాలంటే రోగుల నుంచి రక్తాన్ని తీసుకొని జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపించాల్సిన పరిస్థితి నెలకొందిన వారు వాపోతున్నారు.

మల్లన్నసన్నిధిలో లలిత సహస్రనామ పారాయణం



పారాయణంలో పాల్గొన్న మహిళలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి శ్రావణమాసం సందర్భంగా మంగళవారం ఏకాదశి పూజలు, దేవస్థానంలో భ్రమరాంభ 108 లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దూపం వీరభద్రయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి 108 లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. ఓదెల, సుల్తానాబాద్, జమ్మికుంట, హుజూరాబాద్ భక్తమండలి భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఆలయ ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి ఏర్పాట్లు చేశారు.

పిచ్చిమొక్కలు, ముళ్లపొదల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా పోతనకాలనీలో సింగరేణి కార్మిక కుటుంబాల కోసం సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌పై పిచ్చిమొక్కలు పెరిగాయి. ఈనెల2న 'సాక్షి'లో 'అపరిశుభ్రంగా వాకింగ్ ట్రాక్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఆర్జీ–2 ఏరియా సింగరేణి అధికారులు స్పందించారు. మంగళవారం వాకింగ్ ట్రాక్ లోపల చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను సిబ్బంది తొలగించారు. సింగరేణి అధికారులకు, సిబ్బందికి వాకర్స్‌తో పాటు పోతనకాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా వాకింగ్ ట్రాక్ లోపల చెట్లు పెరగకుండా ఉండేందుకు చిన్న చిన్న చిప్స్ వంటి కంకర పోసి, చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

• పిచ్చిమొక్కల తొలగింపు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 21వ డివిజన్ ఎఫ్‌సీఐ ఎల్కలపల్లిగేట్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారాయి. స్పందించిన నగరపాలక సంస్థ అధికారులు పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను మంగళవారం తొలగించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• కేజీవీల్స్ ట్రాక్టర్ సీజ్

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెద్దంపేటలో మంగళవారం కేజీవీల్స్ ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. రోడ్డుపై కేజీవీల్స్ నడిపిస్తుండగా బ్లూకోల్ట్స్ సిబ్బంది ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్ రావుకు అప్పగించారు. నిబంధనలకు విరుద్ధంగా కేజీవీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై నడిపిస్తే జరిమానాతో పాటు ట్రాక్టర్ సీజ్ చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

• విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు అందజేత

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లిలో బండారి రాజయ్య వర్ధంతి పురస్కరించుకొని మంగళవారం అంగన్‌వాడీ విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, వాటర్ బాటిళ్లు, పండ్లు అందజేశారు.

• గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన కోట లింగయ్యగౌడ్(55)అనే గీత కార్మికుడు సోమవారం తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ రెక్కాడితే డొక్కాడని నిరుపేద మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.25వేలు అందించడంతోపాటు ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలన్నారు.

• జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం విజయవంతం చేయాలి

జూలపల్లి: మండలంలో 11న నిర్వహించే జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహించే సందర్భంగా ఏఎన్‌ఎం, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. హెల్త్ ఎడ్యుకేటర్ మధుసూదన్, సీహెచ్‌వో కలీమొద్దీన్, హెచ్‌వీ వసంత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి పాల్గొన్నారు.

• బహిరంగ సభ విజయవంతం చేయాలి

ఓదెల: దివ్యాంగులపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిరసనగా 13న హైదరాబాద్‌లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రావు కోరారు. ఓదెలలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాసపల్లి రవికుమార్ అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. దివ్యాంగుల పోరాట సమితి నాయకులు ఐరెడ్డి నారాయణరెడ్డి, అమీన్‌బేగ్, రామినేని సునీల్, ఎమ్మార్పీఎస్ నాయకులు పల్లె సుమన్, క్యాదాసి కిరణ్‌కుమార్, దొడ్డె రాజయ్య, రేగుల కనుకయ్య, రాచర్ల ఓదెలు పాల్గొన్నారు.

• భూ సమస్యలు పరిష్కరిస్తాం

జూలపల్లి: రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు భూభారతి ద్వారా చేపట్టిన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆర్‌ఐ భవానీ ప్రసాద్ కోరారు. మండలంలోని పెద్దాపూర్‌లో మంగళవారం భూ భారతిలో రైతులు సమర్పించిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. రైతులు చేసుకున్న ప్రతీ దరఖాస్తును పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

• పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలో మంగళవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణమూర్తి, శ్రీనివాస్ మాట్లాడారు. పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 1న తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

• ఐఎఎస్‌బీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

గోదావరిఖనిటౌన్: అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఐఎస్‌బీ) ఆధ్వర్యంలో విద్యార్థుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కన్వీనర్ ఈర్ల రామచందర్ మంగళవారం స్థానిక కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అనుబంధ సంఘమైన అఖిల భారత విద్యార్థి బ్లాక్ విద్యా సమస్యల పోరాటాల్లో ముందుంటుందన్నారు. నాయకులు బెజ్జంకి ప్రణయ్, సత్యనారాయణ, శ్యామ్ పాల్గొన్నారు.

• ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

రామగిరి: మండలంలోని రాజాపూర్ వద్ద ఆటో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. మంథని మండలం గద్దలపల్లి(దర్శారం) గ్రామానికి చెందిన తోకల కాపీర్(44) ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా రాజాపూర్ బస్టాండ్ వద్ద అదుపు తప్పి ఆటో బోల్తాపడింది. వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కాపీర్ కుమారుడు బిన్ను(13)కు చేతి విరడంతో పాటు దవడకు గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న స్వరూప(40), రాజక్క (62) స్వల్ప గాయాలపాలయ్యారు.

ఎమ్మెల్యేకు సన్మానం



గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌ను ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కలాంబా మంగళవారం సన్మానించారు. ఢిల్లీలోని ఇంద్రభవన్‌లో రాజ్‌ఠాకూర్‌ను కలిసి శాలువాతో సన్మానించారు.

మెడికల్ బోర్డులో అన్యాయం జరిగింది

గోదావరిఖని: సింగరేణి హయ్యర్ మెడికల్ రెఫరల్ బోర్డులో తమకు అన్యాయం జరిగిందని సింగరేణి ఉద్యోగులు వాపోయారు. స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లాగౌడ్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తిరిగి మెడికల్ బోర్డు ఏర్పాటు చేయించి మెడికల్ ఇన్వాలిడేషన్ చేసేలా చూడాలని కోరారు. ఇన్వాలిడేషన్ స్థానంలో తమ పిల్లలకు ఉద్యోగం వస్తుందని ఆశపడి ఎదురుచూసిన తమకు అన్యాయం జరిగిందన్నారు. గత నెల 31న జరిగిన మెడికల్ బోర్డును రద్దు చేసి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తమను ఇన్వాలిడేషన్ చేయాలని విన్నవించారు.

సమ్మెరోజును రెస్ట్‌గా మార్చడం సరికాదు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహించిన సమ్మెలో పాల్గొన్న కార్మికులకు ఆరోజును రెస్ట్ డేగా మార్చినట్లు సింగరేణి గుర్తింపు ప్రాథమిక సంఘాలు చెప్పడాన్ని సీఐటీయూ యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బ్రాంచ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కొన్ని సంఘాలు అధికార ముసుగులో కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ, సమ్మె హక్కులు కాలరాస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి నిర్ణయాలతో భవిష్యత్‌లో కార్మికులు నష్ట పోవడమేకాక సమ్మెలో పాల్గొనేందుకు ముందుకు రావడానికి అసహనం వ్యక్తం చేసే అవకాశం ఉంటుందని వాపోయారు. కార్మిక హక్కులు, సంస్థను కాపాడుకునేలా ఆలోచనలు ఉండాలని కోరారు. సీఐటీయూ ఆర్జీ–2 సెక్రటరీ కుంట ప్రవీణ్‌కుమార్, సీనియర్ నాయకులు ఉల్లి మొగిలి, సంపత్, రాంప్రసాద్, భూమయ్య, విజయ్‌కుమార్, లక్ష్మీరాజం, వెంకటనర్సయ్య, వినేష్, రాజేందర్, కిషోర్, తిరుపతి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ సుబ్బారెడ్డి

ఓదెల: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి అన్నారు. ఓదెల రైతువేదికలో మంగళవారం ట్రాక్టర్స్ ఓనర్స్, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాక్టర్ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ట్రాక్టర్ ఓనర్స్, డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. పేదవారి ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుకను అధిక రేట్లకు విక్రయించొద్దన్నారు. అనుమతి లేకుండా ఇసుకను ఓవర్‌లోడ్‌తో వెళ్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ దీరజ్‌కుమార్, పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్, బీజేపీ నాయకులు కొండపాక నర్సింహాచారి పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా చూడాలి



సమావేశం నిర్వహిస్తున్న రవీందర్‌రెడ్డి

గోదావరిఖని: ఉద్యోగులు తమ సమస్య పరిష్కారం కోసం రోజుల తరబడి జీఎం కార్యాలయం చుట్టూ తిరగకుండా చూడాలని ఆర్జీ–1 పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఆదేశించారు. జీఎం కార్యాలయంలో పర్సనల్ విభాగం కార్యాలయంలో మంగళవారం సంక్షేమాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గైర్హాజర్ ఉద్యోగులు, సీఎంపీఎఫ్ నామినేషన్లు పెండింగ్, కారుణ్య నియామక ఉద్యోగాలు, టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీవైపీఎం వేణు, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్, హనుమంతరావు, ఫిరోజ్‌ఖాన్, సంక్షేమాధికారులు రవీందర్, గణేశ్, నాగరాజు, శ్రీనివాస్, సాయి నిహాల్ పాల్గొన్నారు.

ఆర్జీ-1 ఏరియాలో క్వార్టర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 ఏరియాలో అధికారులు మంగళవారం క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. జీఎం కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఎన్‌సీ, ఓల్డ్‌బీ, ఎంజీఆర్ తదితర క్వార్టర్లకు కౌన్సెలింగ్ చేపట్టారు. 17 క్వార్టర్లకు గాను 24మంది దరఖాస్తు చేసుకోగా 7 క్వార్టర్లను కౌన్సెలింగ్ ద్వారా కేటాయించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం ఆంజనేయప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవోలు హనుమంతరావు, ఫిరోజ్‌ఖాన్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్



గోదావరిఖని: ఇసుకను స్వాధీనం చేసుకున్న వన్‌టౌన్ పోలీసులు

గోదావరిఖని: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సప్తగిరికాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 130 ట్రాక్టర్ల ఇసుక డంపును స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని రామగుండం తహసీల్దార్‌కు సమాచారం అందించగా ఆర్‌ఐ సమక్షంలో ఇసుకను సీజ్ చేశారు. విచారణ తర్వాత ఇసుకను వేలం వేయనున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

40ట్రాక్టర్ల ఇసుక..

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కార్పొరేషన్ 22వ డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో నిల్వ చేసిన రెండు ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు, ఎన్టీపీసీ ఎస్సై ఆధ్వర్యంలో తనిఖీ కేసి ఇసుక డంపులు సీజ్ చేశారు. ఇసుక డంపు నిర్వాహకులు పత్రాలు చూపించగా వాటిని రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. సుమారు 40 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలం

రామగిరి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది సీపీఐ మాత్రమేనని ఆ పార్టీ పూర్వ జిల్లా కార్యదర్శి గౌతం గోవర్ధన్ అన్నారు. మండలంలోని సెంటినరీకాలనీలో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమవేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. 19 నుంచి 22 వరకు మేడ్చల్‌లో నిర్వహించనున్న 4వ రాష్ట్ర మహాసభలు విజవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి వై.వి.రావు, మండల కార్యదర్శి రాంచందర్, నాయకులు డీటీ రావు, రమణయ్య, మొండయ్య, రాజేందర్, గంగాధర్ పాల్గొన్నారు.

గంజాయికి బానిస కావొద్దు

ముత్తారం: యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ముత్తారం ఎస్సై గోపతి నరేశ్ హితవు పలికారు. ముత్తారంలో మంగళవారం సాయంత్రం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రజలు అత్యవసర సమయంలో పోలీస్ సాయం పొందాలన్నారు. డయల్ 100కు సమాచారం అందిస్తే అందుబాటులో ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బంది నిమిషాల వ్యవధిలో వచ్చి తగు చర్యలు తీసుకుంటాన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు సమచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అశోక్, రాజా కుమార్, సుమంత్‌రెడ్డి, హోంగార్డ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తిచేయాలి

ఓదెల: గ్రామాల్లో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి కోరారు. మండలంలోని ఉప్పరపల్లెలో మంగళవారం ఆయన ఇందిరమ్మ ఇళ్లను సందర్శించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే విజయరమణారావు చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు పల్లె రాంరాజు, చిలుక హరికాంత్, పల్లె రాజయ్య, అయోధ్య, చిలుక శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.